కథకి 'క్లయిమాక్స్'

ఇన్ని సంవత్సరాలైన తరువాత నా మొదటి కథను గురించి ఆలోచిస్తే కడుపు చెక్కలయ్యేటట్లుగా నవ్వొస్తుంది. కాని అప్పుడు మాత్రం నరకయాతన అనుభవించాను.

ఆ రోజు యింటికి త్వరగా వెళ్ళాలని ఆఫీసునుంచి బయలుదేరాను—బయటకు రాగానే కలవరం కలిగింది. కడుపులో దేవినట్లుగా, దిగులుగా, భారంగా పిచ్చి పిచ్చిగా వుంది. ఈ అవస్థ అర్థంచేసుకోలేక, ఏమీతోచక, ఊరంతా తిరిగాను. కాని ఈ అనుభవం మాత్రం నాకు నూతనం కాదు. అప్పుడప్పుడూ యిలా బాధపడడం, చివరకు ఏదో ఆపత్తు సంభవించటం, నా జీవితానికి మామూలే! ఒకప్పుడు ఆప్తబంధువు మరణించాడు; మరి ఒకప్పుడు ప్రాణస్నేహితుడు వివాహంచేసుకున్నాడు; యింకొకప్పుడు నా కుద్యోగం లభించింది.

ఇవన్నీ ఆలోచించుకునేటప్పటికి, ఈ రో జేంజరుగుతుందో అని భయం వేసింది. వెంటనే చిట్టి జ్ఞాపకంవచ్చింది- గబ గబా యింటికి వెళ్లాను. ఇంట్లో అడుగు పెట్టగానే నా భార్య కనిపించింది. "చిట్టి ఎలాగుంది ? కులాసా..." అని ఆదుర్దాగా అడిగాను.

సీత నన్ను వింతగా ఎగాదిగా చూచి జవాబు చెప్పకుండా ఊరుకుంది.

నాకు భయం యెక్కువైంది. "చెప్పు చిట్టి..." అని గుటకలు మింగుతూ అడిగాను.

ఆమె హేళనగా నవ్వి, "ఎందుకీ కంగారూ? యింతలో ఏం జరుగుతుందీ?" అని చర చరా యింట్లోకి వెళ్ళింది.

నేను భారంగా అడుగులు వేసుకుంటూ నాగది ప్రవేశించాను. "ఏమిటీ బాధ?? అర్థంకాని, సహించలేని ఈ బాధ—" అని తీవ్రంగా ఆలోచించాను—ఈ ఆలోచనతో తల పగిలిపోతూ వుంది—గంటలు గడిచిపోతున్నాయి—కాని నా బాధ పోనూపోదు—అర్థం కానూకాదు.

ఆ సమయంలో నా భార్య నెమ్మదిగా వచ్చి లాంతరు వెలిగించింది.

నా మాటల ధ్వనికి నాకే ఆశ్చర్యమేసింది. నాభార్య ఒణికిపోయింది. అప్పుడు నా రూప మెలావుందో నే చెప్ప లేనుగాని నా భార్యమాత్రం ఒక భూతాన్ని చూచినట్లు చూచి గదిలోంచి పారిపోయింది.

నేను మళ్ళీ కుర్చీలో కూర్చున్నాను. తల చేతుల్లో యిరికించుకున్నాను. నాలో ఏదో ఒక వింత ఆవేదనపుట్టి బాహిరిల్లటానికి తంటాలు పడుతూన్నట్లుగా అనుమానం కలిగింది—

ఏమిటిది? ఆఁ!...ఆఁ!... తెలిసింది.

మధ్యాహ్నంనుంచీ నాలో జరుగుతూన్న సమరానికి అర్థం నా కిప్పుడు గోచరించింది. తెలిసి బిగ్గరగా నవ్వుకున్నాను. నే నింత చీకాకుపడి బాధపడటానికి కారణం ఏమను

కున్నారు ? నాకొక కథొచ్చింది ! నా హృదయం నాతో కథను రాయించటానికి ఉదయాన్నించీ ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాన్ని సరిగ్గా గ్రహించలేక యింత బాధపడ్డాను. చెప్పుకుంటే సిగ్గుచేటు !

వెంటనే కలం తీసుకున్నాను. కాగితాలు తీసుకు న్నాను. టేబిల్ ముందుకు లాక్కున్నాను. "కథ రాయాలి! చిన్నకథ రాయాలి ! బుల్లికథ రాయాలి !" అని కృతనిశ్చ యంతో కాగితంమీద కలంపెట్టాను—కాని మరో బాధ !

కథ ఎలా వ్రాయాలి ? ఏవిధంగా మొదలుపెట్టాలి ? ఏవిధంగా అంతంచెయ్యాలి ? ఏదో క్లైమాక్సు అంటారే ? దా న్నేవిధంగా తీసుకురావాలి ?

నే నప్పటికి కథలు వ్రాయకపోయినా, అవి ఎలా వుండాలో, వాటి లక్షణాలేమిటో చాలా గ్రంథాల్లో చది వాను. ఒక గ్రంథకర్త యిలా వ్రాశాడు : "ప్రబంధ కవి త్వానికీ భావకవిత్వానికీ ఎంత తేడావుందో నవలకూ కథకూ అంత తేడావుంది. భేదంకూడా ఒక్కటే ! కథకు ఆవేశం ముఖ్యావసరం" అని వ్రాశాడు.

కనుక దీన్నిబట్టి కథ రాయటానికి కలం కాగితాల కంటే ఆవేశం ముఖ్యమని గ్రహించాను. కాని యీ ఆవేశం ఎలా వస్తుంది ? దీన్ని కథకులు ఎల్లా తెచ్చుకో గల్గు తున్నారు ?

ఈసారి కలం పెదవికి ఆనించి మరీ ఆలోచించాను. ఏమీ తోచక నిరాశగా, కిటికీలోంచి బైటికి చూశాను— బైట పండువెన్నెల ! పూలమొక్కలు, సువాసనలు విర

జిమ్ముతున్నాయి. చల్లగాలి వీస్తూంది — కథకుల రహస్యం నా కప్పుడు బోధపడింది—కథకు కావలసిన ఆవేశం ఎలా వస్తుందో నా కపుడు తెలిసింది. ఆవేశం కలగడానికి తగిన వాతావరణం కావాలి.

"వాతావరణం కావాలి—వాతావరణం కావాలి" అనుకొంటూ కలం చెవులో పెట్టుకొని కాగితాలు చంకలో పెట్టుకొని, కుర్చీ చేత్తో పట్టుకొని తోట్లోకి పరుగెత్తాను.

దారిలో మా నౌకరు నన్నుచూచి, నా అవస్థచూచి, నా అవతారం జూచి నిలువుగుడ్లు వేసి స్తంభించిపోయాడు. 'పాపం! కళాహృదయం వేయించే గంతులు, చేయించే చేష్టలు-యీ అమాయక హృదయానికి ఏ మర్థమౌతాయి?' అనుకుంటూ తోట ప్రవేశించాను.

తీరిగ్గా కుర్చీ వేసుకొని, కాగితాలు ముందుపెట్టుకొని, కలం చేతిలో పట్టుకొని, కళ్ళుమూసుకొని తదేకధ్యానంతో ఆవేశంకోసం ప్రయత్నిస్తూ కూర్చున్నాను- ఆ చల్లగాలిలో ఆ పండువెన్నెల్లో, ఆ ప్రకృతిశోభలో ఆవేశంరాక ఏం జేస్తుంది?

హఠాత్తుగా, సముద్ర కెరటంలాగా, నీటి జలలాగా, మలేరియా జ్వరంలాగా, ఉబుకుతూ ఉబుకుతూ రానే వచ్చింది— వెంటనే కలం-కాగితం తీసుకొని నా మొదటి కథ వ్రాయటానికి ఉపక్రమించాను:—

అది కటికిచీకటి—ఆకాశం మేఘావృతం—ఆ తోట నిర్మానుష్యం-అంతా నిశ్శబ్దం. [ఇక్కడ మూడుచుక్కలు,

మళ్ళీ కథ]—ఆక్షుల గలగల ధ్వని. మోహనరావు దొంగ లాగా అడుగులో అడుగు వేసుకుంటూ ప్రవేశించాడు — తోటలోని పూలమొక్కలు అతన్ని ఆహ్వానించాయి. వృక్షాలుమాత్రం కదలక మెదలక కన్నీటిబొట్లు రాల్చాయి. [మళ్ళా మూడుచుక్కలు — మళ్ళీ కథ] అప్పటికప్పుడే రాధ అశోకవృక్షం క్రింద మోహనరావుకై నిరీక్షిస్తూ, కూర్చుని వుంది—మోహనరావు గప్‌చిప్‌గా ఆమెన్ను సమీపించి తన కరపల్లవాలతో ఆమె నేత్రపద్మాలను మూసి ఏమన్నాడో చూశారూ?—

"నే నెవరినో చెప్పుకో!" అన్నాడు. ఆమె రివ్వున వెనక్కి తిరిగి చేతులను చాచి, "నాథా! నా హృదయాధినాథా! వచ్చితివా?" అన్నది. అతడుకూడా వెంటనే చేతులుచాచి "ప్రేయసీ! హృదయేశ్వరీ, వచ్చితిని—వచ్చితిని" అన్నాడు. ఇద్దరూ కలిసి ఒకపాట పాడారు—తర్వాత కౌగలించుకొన్నారు. [డ్యాష్]

ఇంతవరకూ కలం జరజరా వెళ్ళిపోయింది. కథ ఒక్క బిగువున నడిచింది—కాని ఎంత గింజుకొన్నా ఇక ముందుకు సాగదు — ఏం చెయ్యాలి? కౌగలించుకొన్న నాయికా నాయకులను ఎలా విడదియ్యాలి? ఆలస్యమైతే ఊపిరాడక, ఏమౌతారో?—

ఈ ఆవేశం నా కెందుకు రావాలి? పోనీ! వచ్చింది వచ్చినట్లుగా ఆసాంతం ఉండక మధ్యలో నన్ను విడచిపెట్టి ఎందుకు పోవాలి? అని ఆలోచిస్తూ కూర్చున్నా.

సమయానికి నాకోసం సీత వచ్చింది. నన్ను చూచింది. నా చేతులోని కలం చూచింది — నా వాలకమంతా చూచింది. మూతివిరిచి—"ఈ పనేదో ఇంట్లోనే చేసుకోరాదూ?" అంది.

సీతను చూడగానే నాకొక వూహా తట్టింది.

"సరేగాని ఇలారా!" అన్నాను.

అయిష్టంగా ఒకడుగు ముందుకు వేసింది.

"నే నొక సలహా అడుగుతాను చెప్పు—"అన్నాను.

ఆమె అవుననూ కాదనూ అనకుండా నిలబడింది.

నే నడిగాను :—"ఇదుగో యిటు చూడూ! ఒక స్త్రీ ఉందనుకో! ఒక పురుషు డున్నాడనుకో! వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారనుకో! ఒక తోటలో కలుసుకున్నా రనుకో! కలుసుకోగానే కౌగలించుకుంటారు గదా? కౌగిల్లో ఉన్నప్పుడు ఆ స్త్రీ మన స్తత్వం యెలా ఉంటుంది? ఏం చేస్తుంది? ఏమంటుంది?" అని లాలనగా అడిగాను.

మొదట్లో సిగ్గుపడింది. తర్వాత కోపంనటించి "ఎప్పుడూ ఇవేమాటలు! ఇంతకంటే మనకు వేరే పనే ముందీ?" అని విదిలించుకుంటూ వెళ్ళిపోయింది.

నాకేమీ తోచలేదు. చంద్రుడు వెన్నెలకాస్తూనే ఉన్నాడు. చల్లగాలి వీస్తూనేవుంది. ప్రకృతి ప్రకాశిస్తూనే వుంది. కాని నాకుమాత్రం ఆవేశం రావటంలేదు. కౌగిల్లో అతుక్కుపోయిన నాయికా నాయకుల్ని ఏంచెయ్యాలో తోచటంలేదు. బలత్కారంగా విడదీస్తేమాత్రం విడిపోయి

ఏంచేస్తారు? ప్రేమించుకున్నవాళ్ళు 'నా హృదయమా! నా ఊపిరితిత్తులా!' అనటంకంటే ఇంకేం చెప్తారు?

కలం విసుగ్గా క్రిందపెట్టాను; తోట్లోకి చూశాను. చంద్రుడు చెట్లసందునుంచి వెక్కిరిస్తున్నాడు. చెవులు గింగురుమనేట్లుగా గాలి వీస్తూంది. కాగితాలు రెపరెపలాడిపోతున్నాయి.

"నాన్నా!" అనే పిలుపు వినిపించింది.

తిరిగిచూచా! చిట్టి నెమ్మదిగా దగ్గరకొచ్చింది. ఇదివరకంత చనువుగా దగ్గరకురాక, బెరుగ్గా భయంగా కొంచెం దూరంగా నిలబడి "అమ్మ రమ్మంది" అంది. "రా! నాన్నా! తేళ్ళూ పాములూ ఉంటై చీకట్లో" అంది.

"కథ పూర్తిచేసి వస్తానమ్మా" అన్నాను.

ఈ మాటవిని చిట్టి కళ్లు యింతంతచేసి, అమాయికంగా అడిగింది: "అసలు కథరాయటం ఎందుకు నాన్నా?"

"క్లైమాక్సుకోసం" అనేజవాబు నోటిదాకావచ్చింది. కాని ఆ చంటిదానికి ఈ గొప్పవిషయాలు అర్థంచేసుకోడానికి ఆయుచాలదని పస్తాయించి ఊరుకొన్నాను.

"పోనీ, ఇంట్లోకివచ్చి రాసుకో నాన్నా?"

"నువ్వెళ్లు చిట్టీ! నా కిక్కడుంటేకాని ఆవేశంరాదు."

"అదేమిటి నాన్నా! అలా అంటావు? చలిగాల్లో ఉంటే జలుబు చేస్తుందిగాని ఆవేశమొస్తుందా?"

నాకామాట వినేటప్పటికి కోప మొచ్చింది ... మళ్ళీ నేనూ నా ఆలోచనా, నా పందువెన్నెలా తయారు! ఈసారి ఎంతసే పాలోచించానో చెప్పలేను. తోటసంగతి మరచి

పోయాను. వెన్నెల మరచిపోయాను. మలయమారుతం మరచి పోయాను. శూన్యహృదయంతో స్మశాన వైరాగ్యంతో కూర్చున్నా.

నేను బాహ్యప్రపంచాన్ని మరచిపోయిన ఈ స్థితిలో దగ్గరగా కేకలూ ఏడుపులూ బొబ్బలూ వినిపించినై. ఉలిక్కి- పడి కంగారుగా తిరిగిచూశాను.

నలుగురు మనుష్యులు—"పాము! త్రాచు! నల్ల త్రాచు! అడ్డంలెండి!" అని కేకలు పెట్టుకుంటూ వస్తు న్నారు.

నా శరీరం వొణికింది; గుండెలు దడదడ కొట్టు కున్నాయి—గొంతులో గురగురమంది—"అమ్మో!" అని అప్రయత్నంగా వెర్రికేకవేసి గభాల్న కుర్చీఎక్కి నిలబడ్డాను. కలం దూరాన పడిపోయింది. కాగితా లెగిరిపోతున్నాయి.

అందుకోటానికి ముందు కొరిగాను. ఇంకేముంది? కుర్చీమీదనుంచి కాలుజారింది. విరుచుకుపడ్డాను.

కథ కంచికి వెళ్ళింది, నేను మంచమెక్కాను.

తర్వాత నాకు తలమీద పెద్దగాయం తగిలిందనీ, జ్వరంలో "నా కథపేరు పాము", "భలే క్లయిమాక్సు పెట్టాను" "ఊపేస్తుంది!" "కాని ఆ నాయికా నాయకుల్ని విడదీసి పుణ్యం కట్టుకోండి!" అని కలవరించాననీ నాభార్య చెప్పి కొంటెగా నవ్వింది.

నాకు మాత్రం నవ్వురాలేదు.

ఇందులోని భావాలు 'నా మొదటి కథ' అనే రేడియో ప్రసంగంలోవి.